## నేలకొరిగిన వరి



గంకొండ సమీపంలో పడిపోయిన వరిచేను చూపిస్తున్న రైతు

కొయ్యూరు మినహా మండలంలో మిగతా ప్రాంతంలో ఆదివారం రాత్రి, సోమవారం భారీ వర్షం కురిసింది. శరభన్నపాలెం, బట్టపనుకుల, నడింపాలెం, పెదమాకవరం, కినపర్తి పంచాయతీల పరిధిలో ఈదురుగాలులు వీచాయి. గాలులకు వరిచేలు నేలకొరిగాయి. గింజ గట్టిపడే దశలో చేలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. -న్యూస్‌టుడే, కొయ్యూరు

## బాణసంచా దుకాణాల ఏర్పాటుకు గడువు 25

రంపచోడవరం, న్యూస్‌టుడే: దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలకు అనుమతుల కోసం ఈనెల 25లోగా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ శివారులో తహసీల్దారు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



- అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల నాలుగేళ్ల క్రితం 103 మంది విద్యార్థులు ముగ్గురు ఉపాధ్యాయులతో నిండుగా ఉండేది. విలీనం తర్వాత ఆ పాఠశాలలో ప్రస్తుతం 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు.
- దేవరాపల్లి మండలం తెనుగుపూడి పాఠశాలలో ఇదివరకు 58 పిల్లలుండే ఇప్పుడు ఏడుగురు మాత్రమే చదువుతున్నారు.
- ఎస్.రాయవరం మండలం కర్రివీధి పాఠశాలలో విలీనానికి ముందు 36 మంది పిల్లలు చదివేవారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులే ఉన్నారు.
- పెదబయలు మండలం పెదవంచరంగి, రాగోలపేట స్కూల్లో 6, 13 మంది చొప్పున పిల్లలు చదువుతున్నారు.
- దేవరాపల్లి మండలం సీతంపేట, ఎండపల్లిపాలెం, వేచలపూడి పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు.

# విలీనం నుంచి విముక్తి!

- జీఓ నం. 117 రద్దుతో ప్రాథమిక విద్యకు ఊపిరి
- కూటమి సర్కారు నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల హర్షం

ఈనాడు, పాడేరు – గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

1, 2, 3, 4, 5 ఇవేవో ర్యాంకులు కాదు... గత వైకాపా సర్కారు విద్యా సంస్కరణల ఫలితంగా చాలా ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సంఖ్యలు. 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ గత వైకాపా ప్రభుత్వం 2021లో నిర్ణయం తీసుకుంది. 'బడుల విలీనం వద్దు.. పిల్లలను దూరాభారం పంపించలేం' అంటూ తల్లిదండ్రులు ఆందోళనలు చేసినా నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఫలితంగా పేద విద్యార్థులు ఇంటి నుంచి ఎంతో దూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ రాకపోకలు సాగించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 302 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఈ నిర్ణయం కారణంగా సర్కారు బడుల్లో చేరికలు గణనీయంగా తగ్గిపోయాయి. విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చాలా పాఠశాలల్లో ఈ ఏడాది పదిమంది లోపే విద్యార్థులు మిగిలారు. వచ్చే ఏడాదికి ఈ పాఠశాలలు చరిత్రలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడింది. కూటమి సర్కారు వచ్చాక విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.



గూడెంకొత్తవీధి మండలంలో నలుగురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు (పాత చిత్రం)

| | |
|---|---|
| అనకాపల్లి జిల్లాలో మొత్తం పాఠశాలలు: | 1,885 |
| 20 మంది లోపు పిల్లలున్నవి : | 235 |
| ఈ ఏడాది ఒక్క విద్యార్థీ చేరని బడులు: | 10 |
| పది మందిలోపు విద్యార్థులతో నడుస్తున్నవి: | 296 |


అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 22 మండలాల్లో 2894 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 2488 ప్రాథమిక, 137 ప్రాథమికోన్నత, 269 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 1.61 లక్షల మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రధానంగా జీఓ నం. 117 రద్దుతో జిల్లావ్యాప్తంగా విద్యార్థులందరికీ దూరప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పనుంది.

### రూ. కోట్లు ఖర్చు చేసినా..

నాడు-నేడు పేరుతో వైకాపా సర్కారు రూ. కోట్లు ఖర్చుచేసినా సర్కారు బడుల్లో చేరేవారే కరవయ్యారు. పాలకుల నిర్ణయాల్లో ముందుచూపు కొరవడిన కారణంగా ప్రభుత్వ బడుల నుంచి ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులు వలస వెళ్లిపోయారు. గత నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలను వీడిపోయారు. ఏటా పదుల సంఖ్యలో సర్కారు బడులు మూతపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ దుస్థితిని గుర్తించి ఇప్పటికిప్పుడు మార్పులు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించి, వచ్చే ఏడాది నాటికి పరిస్థితులను మార్చే దిశగా అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల కమిటీ అభిప్రాయాలను తీసుకుని జీఓ నం. 117 రద్దుకు నిర్ణయించింది.

### చేరికలు పెరుగుతాయి

పాఠశాల విద్య ప్రక్షాళన చేయడం సరైన నిర్ణయమే. గిరిజన ప్రాంతాల్లో సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రక్షాళన చేస్తే మేలు జరుగుతుంది. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో పట్టుమని పది మంది పిల్లలు కూడా ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారు కూడా తగ్గిపోయారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరుగుతాయి.



– ఉగ్రంగి వెంకటగిరి, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ



అనకాపల్లి జిల్లాలో ముగ్గురు విద్యార్థులకు బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు

### గొప్ప నిర్ణయం



విద్యాహక్కు చట్టం ప్రకారం ఒక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా ప్రతి బడికి ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తే మేలు జరుగుతుంది. జీఓ నం. 117 రద్దు హర్షణీయం. ఈ జీఓ రద్దుతో సర్కారు బడులకు పూర్వ వైభవం రానుంది.

– సాసం వినోద్‌కుమార్, డీటీఎఫ్ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు

### ప్రాథమిక విద్యకు మేలు

ప్రభుత్వం జీఓ నం. 117 రద్దుతో ప్రాథమిక విద్యకు మేలు జరగనుంది. గతంలో 3, 4, 5 తరగతులను విలీనం చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరే విద్యార్థులు బాగా తగ్గిపోయారు. ప్రభుత్వం నిర్ణయంతో మరలా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరుగుతాయి. – ఇ.పైడిరాజు, ఎస్‌టీయూ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి



దేవరాపల్లి మండలంలో పిల్లలు చేరక మూతపడిన సీతమ్మపేట ప్రాథమిక పాఠశాల

## కేకే లైనులో పట్టాలు తప్పిన గూడ్స్



రెండు రైళ్ల మధ్య నడుచుకుంటూ వస్తున్న ప్రయాణికులు

అనంతగిరి, న్యూస్‌టుడే: కొత్తవలస-కిరండూల్ (కేకే) రైలు మార్గంలో సోమవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్ బోగీలో ఒక చక్రం అనంతగిరి మండలం చిమిడిపల్లి స్టేషన్ వద్ద కిందకు జారింది. హుటాహుటిన సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రూట్ క్లియర్‌గా లేకపోవడంతో మరో గూడ్స్ రైలును బొర్రా స్టేషన్ వద్ద నిలిపివేశారు. అదే సమయంలో రైల్వే సిబ్బందికి సంబంధించిన ఓ రైలు నాలుగు బోగీలతో రాగా దాన్ని కూడా బొర్రా స్టేషన్‌లోనే నిలిపారు. ఇవి రెండు వైపులా ఉండటం, అదే సమయానికి కిరండూల్ పాసింజర్ రావడంతో దాన్ని మధ్యలో ఉన్న లైనులో ఆపారు. ప్రయాణికులు దిగేందుకు ప్లాట్‌ఫాం అందుబాటులో లేకపోవడంతో రెండు రైళ్ల మధ్య నుంచి నడుచుకుని బయటకు రావాల్సి వచ్చింది. మరమ్మతుల అనంతరం మిగతా రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.



పట్టాలు తప్పిన గూడ్స్ చక్రాలు

## 23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు ఈనెల 23న కేజీహెచ్ ఆవరణలోని నర్సుల క్లాక్‌రూమ్‌లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, తర్వాత ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న నర్సులంతా ఓటర్లేనన్నారు. వారు ఓటు వేసేందుకు ఏదో ఒక గుర్తింపు కార్డుతో రావాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయరాదని సూచించారు.

## సమరయోధుల మ్యూజియం పనులకు ఊతం

### రూ. 6.75 కోట్ల నిధుల మంజూరు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి మండలం తాజంగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం రూ. 6.75 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి గిరిజన సంక్షేమశాఖ పరిపాలన అనుమతులు ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతోపాటు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించడంతో నిర్మాణాల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఈ మ్యూజియం పనులు మూడేళ్ల కిందట మొదలయ్యాయి. మొత్తం రూ.35 కోట్ల వ్యయంతో ఈ పనులు ప్రారంభించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.20 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్లు వెచ్చించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ వాటాగా గత ఏడాది రూ.7.5 కోట్ల నిధులను పాడేరు ఐటీడీఏ ఖాతాకు జమచేసింది. గత ప్రభుత్వం ఈ నిధులను దారి మళ్లించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. తర్వాత మళ్లీ ఆ నిధులను సర్దుబాటు చేసి గుత్తేదారుకు విడతల వారీగా చెల్లించారు. ప్రస్తుతం హాట్ బజార్, రెస్టారెంట్, హంపీ థియేటర్, నాలుగు బ్లాకులుగా మ్యూజియం పనులు జరుగుతున్నాయి. వర్షాల కారణంగా పనులకు ఆటంకం కల్గింది. దీనికి తోడు ఇసుక కొరత కారణంగా రెండు నెలలుగా పనులు మందకొడిగా సాగాయి. ఇనుము, సిమెంటు అందుబాటులో ఉండటంతో రెస్టారెంట్ స్లాబ్ పనులు పూర్తిచేశారు. వాస్తవానికి 2024 డిసెంబరు నాటికే ఈ పనులు పూర్తిచేయాలన్నది లక్ష్యం కాగా.. గత ప్రభుత్వ తీరుతో ఆలస్యం జరిగింది. ఇప్పుడు కూటమి సర్కారు తాజంగిలో మ్యూజియం పనులు వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన నిధుల్లో రూ. 6.75 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇంతకాలం నత్తనడకన సాగిన మ్యూజియం పనులు గడువులోగా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.




నిర్మాణంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం

## పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

పాడేరు, న్యూస్‌టుడే: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు కాపాడడానికి పోలీసులు చేస్తున్న సేవలు, త్యాగాలు వెలకట్టలేవని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీసు ఉద్యోగం పెను సవాళ్లతో కూడుకున్నదని, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అసాంఘిక శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా సిబ్బంది పనిచేయడం అభినందనీయమన్నారు. స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అసువులుబాసిన అమరవీరుల త్యాగాలను కొనియాడారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. అమరవీరుల కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి అల్పాహారం ఆరగించారు. పాడేరు, అరకు సీఐలు దీనబంధు, హిమగిరి, స్పెషల్ బ్రాంచి సీఐ అప్పలనాయుడు, ఎస్సై సత్యనారాయణ, విశాఖపట్నం నుంచి సీఆర్‌పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో అదనపు ఎస్పీ క్రైం ఎల్.మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 216 మంది, రాష్ట్రంలో ఇద్దరు పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారన్నారు.





పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్

# పల్లె గొంతు తడిపేలా..!



### పీవీటీజీ గ్రామాల్లో తాగు నీటికి జన్‌మన్ నిధులు

### రూ. 14.71 కోట్లతో 147 పథకాల ఏర్పాటు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

**అసలే మన్యం.. ఆపై ఎక్కడో కొండల్లో విసిరిపారేసినట్లు ఉండే గిరిజన గ్రామాలు. తాగునీరు కావాలంటే ఎన్నెన్నో ఇబ్బందులు పడాలి. ఇక కొండపోడు చేసుకునే ఆదివాసీ (పీవీటీజీ) గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయం. ఊటనీరు తప్ప మరే ఆధారం ఉండదు. శుభ్రమైన తాగునీరు దొరక్క ఆదివాసీలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇలాంటి పీవీటీజీ గ్రామాలకు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం ద్వారా ఇప్పటికే ఆయా గ్రామాలకు రహదారులు, గృహాల నిర్మాణం చేపడుతోంది. తాజాగా స్వచ్ఛమైన నీరు అందించేందుకు నిధులు విడుదల చేస్తోంది.**

కనీస సౌకర్యాలు లేని గ్రామాల్లో రహదారులు, వైద్యం, తాగునీరు, స్వయం ఉపాధి, గృహ నిర్మాణం, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు, విద్యుత్తు, సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం అమలు చేస్తోంది. జిల్లా అంతటా సర్వే చేసి 147 పీవీటీజీ గ్రామాలు కనీస వసతులకు దూరంగా ఉన్నాయని గుర్తించారు. జన్‌మన్ పథకం కింద ఈ గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. ఇందుకోసం మొత్తం రూ. 14.71 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధుల్లో రూ. 5.40 కోట్లతో 53 కొత్త పథకాలు ఏర్పాటు చేస్తారు. మిగతా రూ. 9.32 కోట్లతో అసంపూర్తిగా ఉన్న 94 పథకాలను పూర్తి చేస్తారు.



దూరం నుంచి బిందెలపై నీరు మోసుకుంటూ వస్తున్న ఆదివాసీ మహిళలు

### వేర్వేరు ప్రాంతాల్లో ప్రత్యేకంగా..

అల్లూరి జిల్లాలో భౌగోళిక పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఏ ప్రాంతంలో ఏ పథకం ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పాడేరు డివిజన్‌లోని 11 మండలాలతోపాటు రంపచోడవరం డివిజన్‌లోని మారేడుమిల్లి, రాజవొమ్మంగి, మండలాల్లో ఉన్న దాదాపు పీవీటీజీ గ్రామాలు కొండ అంచుల్లోనే అధికశాతం ఉంటాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్తు మోటారు పెట్టి పైపులైన్లు ఏర్పాటు చేయడం కష్టంతో, వ్యయంతో కూడుకున్నది. విడుదలైన నిధులు, పథకాల సంఖ్య ఆధారంగా సరాసరి ఒక్కో పథకానికి రూ. 10 లక్షల మేర ఖర్చు చేయాల్సి ఉండటంతో మోటారు పథకాలు ఏర్పాటు చేయడం ఇబ్బందికరమే. దీంతో పాడేరు, రంపచోడవరం డివిజన్లలో మండలాల్లో గ్రావిటీ పథకాలు ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నారు. చింతూరు డివిజన్ పల్లపు ప్రాంతంగా ఉండటం, గోదావరి నీరు అందుబాటులో ఉండటంతో విద్యుత్తు మోటారు పథకాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**మండలం వారీగా పథకాల సంఖ్య**

| | |
|---|---|
| పాడేరు | 4 |
| జి.మాడుగుల | 2 |
| చింతపల్లి | 1 |
| గూడెంకొత్తవీధి | 4 |
| కొయ్యూరు | 5 |
| హుకుంపేట | 13 |
| డుంబ్రిగుడ | 2 |
| అరకులోయ | 9 |
| పెదబయలు | 14 |
| అనంతగిరి | 1 |
| ముంచంగిపుట్టు | 48 |
| కూనవరం | 4 |
| చింతూరు | 25 |
| మారేడుమిల్లి | 14 |
| రాజవొమ్మంగి | 1 |
| మొత్తం | 147 |

### అనుమతులు వచ్చాక పనులు

జన్‌మన్ పథకం కింద మంజూరైన పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయి. పాలనాపరమైన, సాంకేతిక ఆమోదం పొందడం, టెండర్లను పిలిచి ప్రారంభించడమే తరువాయి. గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం చేపట్టాల్సిన పథకాలకు మాత్రం ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇప్పటికే ఆ శాఖ జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి పనులు చేస్తోంది. దీని అమలుపై కూటమి ప్రభుత్వం పల్స్ సర్వే నిర్వహించింది. ఆ నివేదిక పరిశీలించిన తరువాత అసంపూర్తి, కొత్త పనులు ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

### స్థానిక పరిస్థితులకు అనుగుణంగా..

పీవీటీజీ గ్రామాల్లో నీటి పథకాల నిర్మాణానికి జన్‌మన్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో భౌగోళిక పరిస్థితులు విభిన్నంగా ఉండటంతో స్థానిక అవకాశాలకు అనుగుణంగా పథకాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జవహర్‌కుమార్, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అల్లూరి జిల్లా

## పంచాయతీలను సచివాలయాలుగా మార్చాలని వినతి

పాడేరు, న్యూస్‌టుడే: పంచాయతీలనే సచివాలయాలుగా మార్చి, అక్కడి సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, సర్పంచులు కోరారు. సోమవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సర్పంచుల సంఘం ప్రతినిధి దాసుబాబు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వాలు పనిచేయాలి తప్ప నిర్వీర్యం చేయకూడదన్నారు. గత వైకాపా ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పక్కనపెట్టి.. సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని పేర్కొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు, సర్పంచులు

## ప్రత్యేక ఆధార్ శిబిరాలు నేటి నుంచి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి.ఎస్.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డుల్లో తప్పులు సరిచేసుకోవడానికి, నవీకరించుకోవడానికి శిబిరాలకు రావాలన్నారు. ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరి అని పేర్కొన్నారు. జిల్లాలో 44 చోట్ల ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు నుంచి పదిహేను సంవత్సరాల మధ్యలో ఉన్నవారు 69,482 మంది, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు 72,972 మంది, 18 సంవత్సరాలు పైబడిన వారు 1,42,454 మంది ఇంకా తమ ఆధార్ కార్డులు నవీకరించుకోవాల్సి ఉందని వివరించారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ కార్డు కోసం నూతనంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాడేరు, న్యూస్‌టుడే: గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేడి నీరు తాగాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులు, వార్డెన్ సూచించారు. పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వామిత్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను పరీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, సిబ్బంది

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్.లోహిత్, ఇ.పవన్‌కుమార్, గోపాలకృష్ణ అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జూనియర్ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకాలు, 4x100 మీటర్లలో తృతీయ స్థానం, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలు సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఒడిశాలోని కలింగ స్టేడియం వేదికగా జరిగే 39వ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపల్, పీడీ అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి నాగబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు విజయలక్ష్మి, అనితకుమారి అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాయక్, పీడీ అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి నాగబాబు

## వ్యసన విముక్తి కేంద్రం ఉద్యోగులకు జీతాల విడుదల

పాడేరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ప్రభుత్వ ఉద్యోగులే కాదు.. ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులు కూడా వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రం ఉద్యోగులకు 14 నెలల పాటు ఒక్క రూపాయి కూడా వేతనం చెల్లించలేదు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, మంత్రులకు విన్నవించినా ఉపయోగం లేదు. విధులు బహిష్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొత్త ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గంజాయి నివారణే లక్ష్యంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను జిల్లా వైద్యారోగ్యశాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో 14 నెలల జీతాలు విడుదలయ్యాయి. పాడేరు వ్యసన విముక్తి కేంద్రం ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు.

### అభ్యంతరాలు తెలియజేయండి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయ, అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ముగిసింది. మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు.

### ధరల నియంత్రణపై దృష్టి సారించాలి

కూనవరం, న్యూస్‌టుడే: మండలంలోని వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు, పురుగుమందుల ధరల నియంత్రణపై దృష్టి సారించాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి నోముల రామారావు కోరారు. భీమవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందుల దుకాణాల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని, అన్ని రకాల నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

## భారీ వర్షంతో ఒరిగిన విద్యుత్తు స్తంభాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరంలో సోమవారం భారీ వర్షం పడింది. స్థానిక రామకృష్ణమిషన్ సంచార వైద్యశాల, యర్రంరెడ్డినగరం, ఎస్టీఆర్ కాలనీలో మూడు విద్యుత్తు స్తంభాలు ఒరిగాయి. తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సరఫరా నిలిపివేశారు. రాత్రి 8.30 గంటల వరకు రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రంపచోడవరం అంబేడ్కర్ కూడలి నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన రహదారి జలమయమైంది. యర్రంరెడ్డినగరం, ఐటీడీఏ నివాసగృహాల వద్ద వీధులన్నీ నీటితో నిండాయి.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలంలో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత అధికంగా ఉంది. ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం కురిసింది. సుమారు మూడుగంటలపాటు వాన పడింది. ఆర్వీనగర్ వారపు సంతలో క్రయ విక్రయాలకు ఆటంకం ఏర్పడింది.



జలమయమైన రంపచోడవరం ప్రధాన రహదారి



యర్రంరెడ్డినగరంలో ఒరిగిన విద్యుత్తు స్తంభం

### రామిరెడ్డి మృతి తీరనిలోటు

దేవీపట్నం, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచి బుద్దమల రామిరెడ్డి (68) మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. దేవీపట్నం మండలం వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని వెలగపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఆయన కుటుంబసభ్యులను శీతంశెట్టి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మరిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మట్టా మోహనరావుగౌడ్, కొండ చినకొండరెడ్డి, మోహన్, రామకృష్ణ, కె. సత్యం రాజు పాల్గొన్నారు.



రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు

### ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం: ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి ఐదో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో దాదాపు అన్ని సీట్లు ప్రభుత్వ ఐటీఐల్లో భర్తీ అయ్యాయన్నారు. ఈ నెల 28న ప్రభుత్వ ఐటీఐలకు, 30న ప్రైవేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.



## మైదానంలోనూ డ్రాగన్ సాగు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పాడేరు మన్యానికే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ సాగు మైదానంలో మంచి దిగుబడులిస్తోంది. కె.కోటపాడు మండలం ఎ.కోడూరుకు చెందిన రైతు **లెక్కల కోటేశ్వరరావు** 3.5 ఎకరాల్లో డ్రాగన్ పండిస్తున్నారు. రెండేళ్ల కిందట పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తూ బిందు సేద్యం ద్వారా నీరందిస్తున్నారు. మొదటి ఏడాది మూడు టన్నులు, రెండో ఏడాదిలో ఇప్పటివరకు ఐదు టన్నుల దిగుబడి వచ్చిందని రైతు వెల్లడించారు.



● తోట వద్దే కేజీ రూ. 150 చొప్పున విక్రయిస్తున్నారు. రెండేళ్లలో ఖర్చులన్నీ పోను రూ.4 లక్షల ఆదాయం వచ్చిందని రైతు కోటేశ్వరరావు పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, చింతపల్లి

### పెరిగిన రంగు, మధ్య రకం బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు పెరిగాయి. నాసి రకం ధరలు యథావిధిగా ఉన్నాయి. రంగులు వంద కేజీలకు రూ.355, మధ్య రకాలు రూ.190 పెరిగాయి. నాసి రకం ధరల్లో ఎటువంటి మార్పు లేదు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

| రకం | గత వారం | ఈ వారం |
|---|---|---|
| రంగులు | 4,640 | 4,995 |
| మధ్య | 3,905 | 4,095 |
| నాసి | 3,375 | 3,375 |

## బేబీ పల్పింగ్ యంత్రంతో..
## గంటకు 250 కేజీల కాఫీ పప్పు



రైతులకు తగ్గిన శ్రమ, సమయం ఆదా

**వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన అల్లూరి సీతారామ రాజు జిల్లాలో గిరిజన రైతులు వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగాన్ని అందిపుచ్చుకుంటున్నారు.**

జిల్లాలో సుమారు 1.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. లక్షకు పైగా కుటుంబాలు కాఫీని వాణిజ్య పంటగా పండిస్తున్నాయి. కేంద్ర కాఫీ బోర్డు నాణ్యమైన కాఫీ పప్పు (పార్చిమెంట్) తయారీ కోసం బేబీ పల్పింగ్ యంత్రాలను రూపొందించింది. ఈ యంత్రాన్ని చేతితో తిప్పడం ద్వారా కాఫీ పండ్ల నుంచి తొక్క, ఇతర వ్యర్థాలు వేరుపడి పార్చిమెంట్ వస్తుంది. ఇది శ్రమతో కూడుకున్నది కావడం, ఎక్కువ సమయం పడుతుండటంతో రైతులు ఈ యంత్రాలను వినియోగించడం లేదు. వాసన్ సంస్థ ఇంజినీరింగ్ నిపుణులతో బేబీ పల్పింగ్ యంత్రంలో కొన్ని మార్పులు



చేయించింది. విద్యుత్తుతో పనిచేసేలా 0.5 హెచ్‌పీ మోటారును అనుసంధానం చేయడంతో గంటకు 250 కేజీల కాఫీ పండ్లను పప్పు చేయవచ్చు. తద్వారా మానవ శ్రమ, సమయం ఆదా అవుతుంది. కేంద్ర కాఫీ బోర్డు ఈ ఏడాది గిరిజన రైతులకు రాయితీపై 140 బేబీ పల్పింగ్ యంత్రాలను పంపిణీ చేయగా.. వీటిలో విద్యుత్తుతో పనిచేసేవి 80 వరకు ఉన్నాయి.

### 85 శాతం రాయితీ

'ఒక్కో యంత్రం విలువ రూ.58 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఇందులో కాఫీ బోర్డు 50 శాతం, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) 35 శాతం రాయితీ ఇస్తున్నాయి. లబ్ధిదారులు 15 శాతం భరించేందుకు ముందుకు వస్తే ఆ మొత్తాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేయిస్తాం. ఈ ఏడాది 600 మంది రైతులు ఈ యంత్రాలు కావాలని దరఖాస్తు చేశార'ని కాఫీ బోర్డు విస్తరణ విభాగం డీడీ రమేష్ పేర్కొన్నారు.

## రైతేరాజు


### చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ

? బిస్కెట్ల తయారీకి చిరుధాన్యాలను వినియోగించవచ్చా.
– భీశెట్టి అభిషేక్, మునగపాక

✔ చోడి, కొర్ర, సామ, ఊద, సజ్జ, వరిగలతో బిస్కెట్లు తయారు చేయవచ్చు. చిరుధాన్యాల పిండితోపాటు గోధుమ పిండి, పంచదార, కొద్దిగా యాలకులు, పాలు, బేకింగ్ పౌడరు వాడాల్సి ఉంటుంది. పరిశోధన కేంద్రానికి వస్తే తయారీ విధానాన్ని వివరిస్తాం.

? వరి పొట్టదశలో ఉంది. ఆకులు తెల్లబడుతున్నాయి. చూస్తే గొంగళి పురుగులు కనిపిస్తున్నాయి. నివారణకు ఏం చేయాలి. – **దాట్ల రామరాజు, ఎస్.రాయవరం**

✔ పంట పిలక దశలో ఉంటే తాడుతో పొలానికి అడ్డంగా రెండు, మూడుసార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. పొట్ట దశలో ఉంటే నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. / ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం **ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

**సాగులో సందేహాలా ఫోను చేయండి:** పాడేరు ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త **డాక్టర్ ప్రదీప్‌కుమార్** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య **95505 06498** నంబరుకు ఫోన్ చేయవచ్చు.

## వరిలో తెగుళ్ల ముప్పు

నక్కపల్లి, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరిని తెగుళ్లు ఆశించాయి. ముందస్తు చర్యలతో వీటిని సమర్థంగా నియంత్రించవచ్చని పాయకరావుపేట సబ్ డివిజన్ ఏడీఏ ఉమాప్రసాద్ సూచిస్తున్నారు.

**ఆకుముడత:** ఆకులు నిలువుగా ముడుచుకుని ఉంటాయి. వీటిని విడదీస్తే లేత పసుపు/ ఆకుపచ్చ గొంగళి పురుగులుంటాయి. గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులు కనిపించినా తెగులుకు సూచికగా గుర్తించాలి. నియంత్రణలో భాగంగా ఎకరాకు 15-20 చోట్ల పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుంది. తెగులు ఉద్ధృతి కనిపిస్తే పైరు



నీట మునిగిన వరి పంట

మీదుగా తాడుతో లాగితే చివర్లలో ఉన్న పురుగులు రాలి కిందపడతాయి. తర్వాత పొలంలో నీటిని బయటకు తీసేయాలి. తొలి దశలో రెండు గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 50 గ్రాముల ఫ్లూబెండమైడ్ మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు సరిపడా చల్లుకోవాలి. ఈ మందు వినియోగిస్తే కాండం తొలిచే పురుగు నియంత్రణలో ఉంటుంది.



**పాముపొడ:** దీన్నే పాచి తెగులు అంటారు. ఆకుపై మచ్చలు వచ్చి కాలినట్లు ఉంటుంది. 2 ఎం.ఎల్. హెక్సాకోనజోల్/ 1 ఎం.ఎల్. ప్రాపికోనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**అగ్గి తెగులు:** ఆకుల మధ్య ఎండిపోయినట్లు ఉంటుంది. దీన్ని గమనిస్తే యూరియా వాడకం తగ్గించాలి. 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు చొప్పున చల్లితే తెగులు నియంత్రణలో ఉంటుంది.

## గురుకులంలో అమలు కాని మెనూ




పెదబయలు గురుకుల పాఠశాలలో ఎంపీపీ, సర్పంచి తదితరులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఎంపీపీ వరహాలమ్మ ఆరోపించారు. పాఠశాలలను సోమవారం సందర్శించారు. వసతిగృహ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొందన్నారు. మెనూ అమలు చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సర్పంచి మాధవరావు, వైస్ ఎంపీపీ బొండా గంగాధరం, వీఆర్వో అజాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువ లేక కష్టాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొర్రా పంచాయతీలోని పీవీటీజీ గ్రామం పెదపాడులో మురుగు కాలువలు నిర్మించి వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో ఆందోళన చేపట్టారు. నాయకులు బాలు, భీమరాజు మాట్లాడుతూ. పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయని చెప్పారు. గ్రామస్థులు మోహనరావు, శంకర్రావు, సదానంద, లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.



పెదపాడులో గిరిజనుల ఆందోళన

## ఏటికొప్పాకకు ఆపన్న హస్తం

ఎలమంచిలి, న్యూస్‌టుడే

**ప్రసిద్ధిగాంచిన ఏటికొప్పాక హస్తకళ మరింత వెలుగులీనేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బొమ్మల తయారీలో అత్యంత కీలకమైన అంకుడు కర్ర లభ్యత తగ్గిపోవడంతో కళాకారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ముడిసరకు కొరత రాకుండా ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ భూముల్లో అంకుడు కర్ర, తెల్లపొనిక చెట్లు పెంచాలని ఆదేశాలు జారీచేసింది. రెండు, మూడు తరాలకు సరిపడా చెట్లు పెంచాలనే ప్రణాళిక తయారు చేసి తక్షణం అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో అంకుడు కర్ర మొక్కలు పెంచాలన్న ఆలోచనలో అధికారులున్నారు.**



ఉపాధి హామీలో అంకుడు పెంపకం

అంకుడు మొక్క ఇదే

లక్కబొమ్మల తయారీలో ఏటికొప్పాక జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 250 కుటుంబాలకు చెందిన 500 మంది కళాకారులున్నారు. వీరిలో మహిళలు 160 మందికి పైగా ఉన్నారు. 200 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఏటికొప్పాక కళాకారులకు ఉంది. లక్కబొమ్మల తయారీకి సున్నితమైన అంకుడు కర్ర వాడతారు. గతంలో ఈ కర్ర పుష్కలంగా దొరికేది. విపరీతంగా చెట్ల నరికివేత కారణంగా ఇప్పుడీ కర్ర లభించడం లేదు. కూలీలు అడవుల్లోకి వెళ్లి చాలా దూరం నుంచి మోసుకురావాల్సి వస్తోంది. దీంతో ఖర్చు పెరిగిపోతోంది. గతంలో మోపు (పది కర్రల కట్ట) రూ. వెయ్యికి లభించేది. ఇప్పుడు దీని ధర రూ. 2500 లకు పెరిగింది. అంత ధర చెల్లించినా బొమ్మల తయారీకి సరిపడా లావు కర్ర దొరకడం లేదు. కలప వ్యయం పెరిగిన కారణంగా బొమ్మ తయారీ ఖర్చు మూడింతలు పెరిగింది. ఈ కారణంగా అమ్మకాలు తగ్గి కళాకారులు లాభాలు తగ్గించుకోవాల్సి వస్తోంది.



అపురూపమైన లక్కబొమ్మ

✦ అంకుడు కర్రపై అటవీశాఖ నిషేధం ఉంది. దీనిని తొలగించాలని చాలాకాలంగా కళాకారులు కోరుతున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏటికొప్పాకలో నదిగట్ల పక్కన, ఏటికొప్పాక చక్కెర కర్మాగారం వెనుక ఉన్న కొండపైనా అంకుడు కర్ర మొక్కలు నాటించారు. తరవాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ చూపించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, అటవీ భూములతోపాటు రైతుల భూముల్లో ఉపాధి హామీ నిధులతో అంకుడు చెట్లు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.



లక్కబొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

### మూడేళ్లలో కోతకు..

అంకుడు కర్ర మొక్క నాటిన మూడు సంవత్సరాలకు కోతకు వస్తుంది. కొమ్మలు నరికి చెట్టు అలా ఉంచితే మళ్లీ చిగురించి కొమ్మలు వేస్తుంది. అంకుడు కర్ర మొక్కలు విస్తారంగా పెంచి ప్రభుత్వమే తక్కువ ధరలకు కళాకారులకు కలప అందిస్తే ఈ రంగంలో మరింత మంది ఉపాధి పొందడానికి ముందుకు వస్తారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపుతుంది
– శ్రీశైలపు చిన్నయాచారి, జాతీయ అవార్డు గ్రహీత, ఏటికొప్పాక

### ఆదేశాలు అందాయి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఏటికొప్పాక పరిసర గ్రామాల్లో 1500 మందికి పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వీరితో ప్రభుత్వ స్థలాల్లో అంకుడు కర్ర మొక్కలు నాటించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత విస్తీర్ణంలో పెంచాలన్నది నిర్ణయిస్తాం. రైతుల పొలాల్లో పెంచడానికి వారు అంగీకరిస్తే వారి భూముల్లోనూ పెంచుతాం. పక్వానికి వచ్చాక ఆ రైతులే కర్రను అమ్ముకుంటారు.
– శ్రీనివాస్, ఏపీఓ, ఎలమంచిలి

### ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఈనెల 22 నుంచి నిర్వహించనున్న ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తేజ్ రతన్ తెలిపారు. ఈనెల 22న కె.కోడాపల్లి, సొలభం, నుర్మతి, 24న వంజరి, పెదలోచలి, భీరం పంచాయతీలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గూడెంకొత్తవీధి మండలం రింతాడ-1, మొండిగెడ్డ, లకవరపుపేటల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

### నవగ్రహ మండపానికి శంకుస్థాపన

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: దిబ్బిడిలో మాణిక్యాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అర్చకులు సన్యాసిరావు, దిబ్బిడి, కె.పి.అగ్రహారం సర్పంచులు మాణిక్యం పాల్గొన్నారు.

### పైపులైన్లకు మరమ్మతులు

దేవీపట్నం: మండలంలోని సత్యసాయి పైపులైన్లకు సిబ్బంది మరమ్మతు పనులు చేస్తున్నారు. కొన్నినెలలుగా కోరుకొండ పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడంలేదు. ఈ నేపథ్యంలో ఇందుకూరుపేట నుంచి గోకవరం మధ్య పైపులైన్లను బాగు చేస్తున్నారు.

### 24న జడ్పీ సాధారణ సమావేశం

విశాఖపట్నం: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 24న జడ్పీ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. సమావేశ అజెండాకు అనుగుణంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలతో నివేదికలు సిద్ధం చేసుకుని రావాలని అధికారులకు సూచించారు.



### వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మోతుగూడెం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చదలవాడ పంచాయతీ సోకులేరు వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. మోతుగూడెం ఎస్సై శివన్నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన కరణం రవితేజ(22).. తన స్నేహితులతో కలిసి సోకులేరు వ్యూపాయింట్‌ను సందర్శించేందుకు ఈనెల 18వ తేదీన వచ్చారు. వారందరూ వాగులో దిగి స్నానాలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రవితేజ కనిపించకపోవడంతో స్నేహితులు గాలించారు. అతడి ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీనిపై 20వ తేదీన యువకుడి తల్లి వెంకటలక్ష్మి మోతుగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం గజ ఈతగాళ్లతో సోకులేరు వాగులో వెతుకుతుండగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



రవితేజ (పాతచిత్రం)

### మూడు నెలల శిశువు మృతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన గుర్తేడు గ్రామానికి చెందిన కడబాల లింగారెడ్డి కుమారుడు (మూడు నెలలు) ఆదివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. శిశువు అనారోగ్యానికి గురవడంతో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. బాబు మృతదేహాన్ని స్వగ్రామం గుర్తేడుకు తీసుకెళ్లకుండా రంపచోడవరం వరకు తీసుకొచ్చి వదిలేశారు. బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే శిరీషాదేవిని ఆశ్రయించగా ఆమె సొంత అంబులెన్సును పంపించారు.



మృతి చెందిన మూడు నెలల బాబు

## రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అమ్మమ్మ ఇంటికి పండగకు వచ్చిన బాలుడిని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. దీనికి సంబంధించి ఎస్.రాయవరం హెడ్ కానిస్టేబుల్ పవన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన షేక్ మహ్మమద్ యాసిన్ తన భార్య, కుమారుడు అబ్దుల్ ఖాదర్ జిలానీ (16)తో నక్కపల్లి మండలం పెదబోదిగల్లంలోని అత్తవారింటికి వచ్చారు. సోమవారం జిలానీ తన తాత షేక్ మహమ్మద్ ఖాదర్ బాషాతో కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చి, తిరిగి వెళ్తుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన జిలానీ తలకు తీవ్రగాయం కాగా, ఎడమ కాలు, చేయి విరిగిపోయాయి. వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై బాలుడి తాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

## సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు

అంతర్వేది, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిపల్లిపాలెం వద్ద సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు బొండు నూకరాజు(55) ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామానికి చెందిన ఇతను చాలాకాలంగా చేపలవేట నిమిత్తం పల్లిపాలెం వస్తుండేవాడు. సోమవారం రోజూ మాదిరిగానే మరో నలుగురు మత్స్యకారులతో కలిసి సముద్రంలోకి వెళ్లాడు. ఈ సందర్భంగా పడవపై నుంచి ప్రమాదవశాత్తు జారి కెరటాల్లో కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా జాడ కనిపించలేదు. దీంతో నూకరాజు సముద్రంలో గల్లంతైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

### హత్యకేసులో అయిదుగురి అరెస్టు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన వంతినిభ బాబూరావు (49) హత్య కేసులో అయిదుగురిని అరెస్టు చేసినట్లు జి.మాడుగుల సీఐ సి.హెచ్.వెంకటరావు సోమవారం తెలిపారు. ఈనెల 17న బాబూరావుకు, సంతవీధికి చెందిన కొంతమందితో గొడవ జరిగింది. ఈ క్రమంలో బాబూరావుపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన అతడిని వైద్యసేవల కోసం పాడేరు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందాడు. అతడి భార్య చీమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం గ్రామానికి చెందిన కిల్లో నరేంద్ర, కిల్లో నర్సింహమూర్తి, కిల్లో బుద్ధ, కిల్లో సొన్ను, కిల్లో నారాయణలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఎస్.ఐ. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.ల్లో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 120 | 115 |
| లైవ్ | 142 | 135 |
| డ్రెస్డ్ | 206 | 240 |
| స్కిన్‌లెస్ | 234 | 250 |

## గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు రాట

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరులో గౌరీపర మేశ్వరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సోమవారం రాట వేశారు. గత 12 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గౌరీ సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొణతాల సతీష్ తెలిపారు. ఈనెల 30 నుంచి నవంబర్ 30 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులు మోహన్, సూరిబాబు, మధు, సాయిరాం, కొణతాల ప్రశాంత్, పరమేశ్వరరావు, కొండ బాబు, సుబ్రహ్మణ్యం, ఈశ్వరరావు, కనిశెట్టి నాయుడు, మహిళలు పాల్గొన్నారు.


రాట మహోత్సవంలో మహిళలు, కమిటీ ప్రతినిధులు

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీఓ డి.ఎన్.వి రమణతో కలసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీ కోసం నిర్వహించి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 57 దరఖాస్తులు అందాయి. వై.రామవరం మండలం వలస గ్రామం నుంచి కోట వరకు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు వేయాలని, కన్నేరు వాగుపై వంతెన పనులు పూర్తి చేయాలని ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ సభ్యురాలు క్రా వెంకటలక్ష్మి తదితరులు కోరారు. మారేడుమిల్లి మండలం పందిరిమామిడికోట గ్రామంలో తాగునీటి ట్యాంకు పనులు పూర్తి చేయాలని సర్పంచి ఈతపల్లి రాజేశ్వరి, సిరిమల్లిరెడ్డి వినతి పత్రం అందజేశారు. రంపచోడవరం మండలం వేములకొండలో అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని గిరిజనులు కారం సురేష్‌బాబు, నెరం వీరా స్వామి, అబ్బులు తదితరులు విన్నవించారు. గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు విజయ శాంతి, పీహెచ్ఓ చిట్టిబాబు, ఉపాధిహామీ ఏపీఓ శ్రీనివాసరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జాన్‌రాజు, వెలుగు ఏపీడీ దేగలయ్య, ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు, ఎంపీడీఓ సుందం శ్రీనివాసుదొర, తహసీల్దారు సత్యనారాయణ, సీడీపీఓ సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ


బంగారుమెట్ట సమీపంలో కోతకు గురైన అంచులు

# అతుకులు పోయె.. గతుకులుగా మారె!

పెదబయలు, న్యూస్‌టుడే

గత ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారులపై ఎంత నిర్లక్ష్యం వహించారో మన్యంలోని పలు రోడ్లను చూస్తే ఇట్టే అర్థమవుతోంది. రహదారులపై గత పాలకులు కనీస శ్రద్ధ చూపకపోవడంతో అవి మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఆదరాబాదరాగా గతుకులకు అతుకులు వేశారు. పోలింగ్ వచ్చేలోపే వాటికి పెచ్చులూడిపోయి గతుకులుగా మారాయి. ఇటీవల భారీ వర్షాలకు ఇవి మరింత దారుణంగా మారాయి.

పెదబయలు మండలం ముసిడిపుట్టు నుంచి కిత్తుకొండ, పన్నెడ, బంగారుమెట్ట వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రహదారి దారుణంగా తయారైంది. ఎక్కడ చూసినా గోతులు పడ్డాయి. రహదారికిరువైపులా కోతకు గురవ్వడంతో వాహనదారులతోపాటు పాదచారులు అవస్థలు పడుతున్నారు. వచ్చే జనవరి నాటికి గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో ఈ రోడ్డు బాగుపడుతుందని వాహనదారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు విస్తరణ ప్రారంభించినా ఎన్నికలు సమీపించడంతో పనులు పూర్తి కాలేదు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, స్థానిక ఎమ్మెల్యే వల్ల ఉపయోగం లేకపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే ఈ మార్గానికి మోక్షం కలిగించాలని, సంపంగిపుట్టు నుంచి బంగారుమెట్ట వరకు రహదారిని విస్తరించాలని ఈప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


పన్నెడ కల్వర్టు వద్ద గోతులమయంగా..

### చిత్తడిగా చింతలపూడి రోడ్డు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని చింతలపూడి పంచాయతీకి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలస్థితికి చేరింది. రెండు మండలాల్లోని గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చింతలపూడి పంచాయతీలో సుమారు పది గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు మారేడుమిల్లి నుంచి వేటుకూరు, పందిరిమామిడికోట, ఇవ్వంపల్లి, భీమవరం మీదుగా వెళ్లాల్సి ఉంది. ఆయా గ్రామాలను కలుపుతూ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో పక్కా రహదారి నిర్మించారు. దశాబ్దాలు గడిచిపోవడంతో ఇది పూర్తిగా శిథిలస్థితికి చేరింది. ప్రస్తుతం దీన్ని చూసినవారికి అసలు ఇది తారురోడ్డేనా అనే అనుమానం కలగక తప్పదు. రోడ్డంతా గోతులు పడి, రాళ్లు తేలి దారుణంగా మారింది. ఈ రహదారి మీదుగానే చింతలపూడి పంచాయతీ పరిధిలోని చింతలపూడి, చింతకొయ్య, వలస, బంగారుబందలు, కొత్తూరు, బొడ్డగుంట, రచ్చవలస, దుంపదారవాడ తదితర గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. రోడ్డుపై గోతులతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రహదారిని పునర్నిర్మించడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


శిథిలమైన చింతలపూడి రోడ్డు

### కిలగాడ దారిలో కష్టాలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలోని కిలగాడ గ్రామానికి వెళ్లే రహదారి ఛిద్రమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలగాడ కూడలి నుంచి కిలగాడ గ్రామానికి వెళ్లే మార్గం రాళ్లు తేలి, గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. మెట్టవీధి నుంచి కిలగాడ వరకు ఇదే పరిస్థితి. కిలగాడ కూడలి నుంచి దారెల, కొత్తులబయలు, తడిగెడ గ్రామాలకు వెళ్లే రోడ్లు సైతం దారుణంగా తయారయ్యాయి. వర్షపునీరు రోడ్డుపై ప్రవహించి ఈ పరిస్థితి ఎదురవుతోంది. దారెల, కిలగాడ గ్రామాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రాళ్లు తేలిన కిలగాడ రహదారి

## అ వీ ఇ వీ

### మద్యం దుకాణాన్ని మార్చాలని వినతి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాన్ని గ్రామం మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడతారని రేఖపల్లి సాయిబాబా ఆలయ వీధి మహిళలు గాయత్రి, భారతి తదితరులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఆలయం, వైద్యశాలకు దగ్గరగా ఉన్న దుకాణాన్ని వేరేచోటకు మార్చాలని కోరారు.

### సదరం వెబ్‌సైట్‌లో జిల్లా పేరు చేర్చాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు డివిజన్ పరిధిలో విభిన్న ప్రతిభావంతులకు సదరం శిబిరం ఏర్పాటు చేయాలని, వెబ్‌సైట్‌లో అల్లూరి జిల్లాను చేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో సంఘ ఉపాధ్యక్షుడు బుజ్జిబాబుతో కలసి మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో జిల్లా పేరు లేకపోవడంతో సదరం జాబితాలో ఉన్నా.. 530 మంది దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పింఛను, ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని చెప్పారు. సంఘ నాయకులు బాలరాజు, జోయో మార్కండ్ తదితరులు పాల్గొన్నారు.

### సదుపాయాల మెరుగుకు చర్యలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుకు పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ లవరాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆసుపత్రిలో విచారణ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ఏరియా ఆసుపత్రి ఉద్యోగులు రాజారావు, లక్ష్మిలను సూపరింటెండెంట్ సరెండర్ చేయడంపై డీసీహెచ్‌వో కృష్ణారావు సోమవారం విచారణ జరిపారు. ఉద్యోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు.

### అభివృద్ధి పనులకు ప్రణాళిక

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఎ.వి.వి కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేశామని పేర్కొన్నారు. కొత్తగా మండలానికి ఏడుగురు కార్యదర్శులు వచ్చారని తెలిపారు.

### పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఐటీడీఏల పాలకవర్గ సమావేశాలు నిర్వహించి జీఓ నంబరు 3పై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డెలిగేట్ చిన్నస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకొసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా వీటిని ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, గాసన్న తదితరులు పాల్గొన్నారు.


మోతుగూడెం డీఏవీ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మానవహారం

## అమరుల సేవలు చిరస్మరణీయం

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం, డొంకరాయి పోలీస్‌స్టేషన్లో ఎస్సైలు శివన్నారాయణ, శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మోతుగూడెం జగదాంబ సెంటర్లో అమరవీరుల స్తూపం వద్ద సీలేరు కాంప్లెక్స్ సీఈ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ బీమవరపు బాలకృష్ణ, చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై శివన్నారాయణ, సర్పంచి ఆకేటి సీత నివాళులు అర్పించారు. సీఈ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు అందిస్తున్న సేవలను కొనియాడారు. అమరుల సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. డొంకరాయి ఎస్సై శివ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

★ మోతుగూడెం ఏపీ జెన్‌కో డీఏవీ ఉన్నత (ఆంగ్ల మాధ్యమం) పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు మల్లెల రాఘురాం ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు.

సీలేరు, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని సీలేరు ఎస్సై జె.రామకృష్ణ అన్నారు. సీలేరు మెయిన్‌రోడ్డులో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. ఆయన మాట్లాడుతూ.. బలిమెల ఘటనలో 36 మంది పోలీసులు అమరులయ్యారని గుర్తు చేశారు. సీఆర్పీఎఫ్ ఇన్‌ఛార్జి సహాయ కమాండెంట్ వీసీహెచ్ పాండే తదితరులు పాల్గొన్నారు. గూడెంకొత్తవీధిలో ఎస్సై అప్పలసూరి మాట్లాడుతూ.. పోలీసు అమరుల ఆశయాలను కొనసాగిద్దామని పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్సై సత్యనారాయణ, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.


సీలేరు ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్సై

రంపచోడవరం, చింతూరు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు పనిచేస్తారని రంపచోడవరం సీఐ రవికుమార్ పేర్కొన్నారు. రంపచోడవరం పోలీసుస్టేషన్ నుంచి అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పోలీసులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. ఎస్సై షరీఫ్, పోలీసుసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. చింతూరులోని భాస్కర విద్యానికేతన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై రమేశ్ పాల్గొని మాట్లాడారు. మన్యంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు చేసిన దాడుల్లో పలువురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రంపచోడవరంలో ర్యాలీ

## భారీగా గంజాయి పట్టివేత

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బలపం పంచాయతీ సురతుపల్లి గ్రామ శివారులో అన్నవరం పోలీసులు 151 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. చింతపల్లి సీఐ రమేష్, అన్నవరం ఎస్సై వరబాబు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు.. సురతుపల్లి గ్రామ శివారులో ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు గంజాయి మూటలతో పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. బలపం పంచాయతీ సురతుపల్లి గ్రామానికి చెందిన మామిడి మోహన్‌రావు, మామిడి నాగేశ్వరరావులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్దనున్న ఆరు గోనె సంచిలను తనిఖీ చేయగా.. 151 కిలోల గంజాయి దొరికింది.

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: సీతగుంట కూడలి సమీపంలో సోమవారం జీపులో తరలిస్తున్న 150 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు సీతగుంట కూడలిలో జీపును ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీన్ని తరలిస్తున్న ముంచంగిపుట్టు మండలం బాబుసాల పంచాయతీ కాంద్రంగివలస గ్రామానికి చెందిన వంతాల జయరాం, శిరగం కిరణ్‌లను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఎస్సై రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో అన్నవరం పోలీసులు

## జీవో నం. 3 రద్దుతో నష్టం


కల్లేరులో ఆదివాసీల ర్యాలీ

చింతూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు జీవో నం 3 అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి డిమాండ్ చేశారు. సోమవారం కల్లేరులో ఆదివాసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీవో నం 3 రద్దుతో గిరిజనులకు నష్టం జరుగుతోందన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. నాయకులు పొడియం నారాయణ, సోడి పెంటయ్య, సవలం కోటేశ్వరరావు, జోగయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాక్ బృందం పర్యటన 7, 8 తేదీల్లో

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం వచ్చే నెల 7, 8 తేదీల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు కళాశాల విద్య రీజినల్ సంయుక్త సంచాలకురాలు శోభారాణి తెలిపారు. సోమవారం కళాశాలను ఆమె తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ చిట్టబ్బాయి, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన జెడ్ స్పేస్ ల్యాబ్ ప్రారంభించారు. విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. గతంలో తాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేశానని తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆర్‌జేడీ శోభారాణికి అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ప్రిన్సిపల్ చిట్టబ్బాయి, అధ్యాపకులు

## ఉపాధ్యాయులకు సమయపాలన తప్పనిసరి

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈవో కృష్ణమూర్తి అన్నారు. సోమవారం సుజనపేట జీయూపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు. సీఆర్‌టీ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈవో

## నిర్వాసితులకు న్యాయం చేయకపోతే ఆందోళన


అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. కూనవరం శాఖ మహాసభల్లో భాగంగా సోమవారం అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిర్వాసితులకు న్యాయం జరగకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామన్నారు. వరద బాధితులందరికీ పరిహారం ఇవ్వాలన్నారు. ప్రస్తుత ధరలతో పోలవరం పరిహారాలు లెక్కకట్టాలని, ఊరు ఖాళీ చేసే నాటికి పద్దెనిమిదేళ్లు నిండిన వారిని అర్హులుగా గుర్తించాలని కోరారు. పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, నాగరాజు, షణ్ముఖరావు, సుధారాణి పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో చేరికలు

ఎటపాక, న్యూస్‌టుడే: కన్నాయిగూడెం పంచాయతీలోని గట్టుగూడెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీ యూత్ అధ్యక్షులు కొమ్ము వెంకటేష్, ఉపాధ్యక్షులు గోవింద్ మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. నాయకులు మోల సతీష్, మందా సుబ్రహ్మణ్యం, శివకుమార్, రాఘవ, శశాంక్ మహేష్, శ్రీను, కోటేష్ పాల్గొన్నారు.


జనసేనలోకి ఆహ్వానిస్తున్న గంగాధర్, నాయకులు

## పరిసరాల శుభ్రత తప్పనిసరి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శశిభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బీసీకాలనీలో సోమవారం ఏఎస్‌డీఎస్ డైరెక్టర్ గాంధీబాబు ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అక్కడి కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, దుప్పట్లు, దుస్తులు అందించారు.

కూనవరం: శబరికొత్తగూడెంలోని గోదావరి వరద బాధితులకు ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు నిత్యావసరాలు అందించారు. గ్రామంలోని 150 కుటుంబాలకు సాయం చేశారు. సర్పంచి భద్రమ్మ, రవి పాల్గొన్నారు.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


వంగ తోటలో తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, క్రాంతికుమార్

రంపచోడవరం, న్యూస్‌టుడే: వంగ, కర్ర పెండలం సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టరు కె.రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం చీడిపాలెం, చెరువుపాలెం, గజ్జివెలగల, పందిరివీధి, కుంజంవీధి గ్రామాల్లో వంగ, కర్ర పెండలం పొలాలను పరిశీలించారు. ఉద్యాన శాస్త్రవేత్త టి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పశువుల పెంపకం లాభదాయకం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పశువుల పెంపకం లాభదాయకమని ఏలేశ్వరం బల్క్ మిల్క్ సెంటర్ సూపర్‌వైజరు రవి అన్నారు. సోమవారం రాజవొమ్మంగి ఎంపాక్ పాల కేంద్రంలో పాడి రైతులతో సమావేశమయ్యారు. దాణా పెట్టే గిన్నెలను రైతులకు పంపిణీ చేశారు. నాగులపల్లి చిన్నారి పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

చింతపల్లి, న్యూస్‌టుడే:

?: చింతపల్లిలో ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మించిన కాలువల్లో ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దుర్గంధంతోపాటు దోమలు పెరిగి వ్యాధుల వ్యాప్తికి కారణం అవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి **– రమేష్, స్థానికుడు**

✓: పట్టణంలోని దుకాణదారులంతా తప్పనిసరిగా వ్యర్థాలను చెత్తబుట్టల్లో వేయాలని సూచిస్తున్నాం. కాలువల్లో చెత్త వేయవద్దని నోటీసులు జారీచేస్తాం. కాలువల్లో ఉన్న పాలిథిన్ వ్యర్థాలను తీయిస్తాం. **– ఆశాజ్యోతి, ఎంపీడీఓ చింతపల్లి**



## ఆకుకూరలతో ప్రయోజనాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఆకుకూరలను ఆహారంలో తీసుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని సీడీపీవో విజయకుమారి అన్నారు. కాకరపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మునగాకుతో తయారుచేసిన 15 రకాల వంటకాలను ప్రదర్శించారు. సీడీపీవో మాట్లాడుతూ మునగాకు, కరివేపాకు ఇంటి పెరట్లోనే ఉంటాయన్నారు. వీటిని పొడులు, చట్నీలు, వివిధ రకాలుగా ఎలా వండుకోవాలో వివరించారు. గర్భిణులకు సీమంతం చేశారు. బీపీసీ సోమశేఖర్, సూపర్‌వైజర్లు సునీత, కొండమ్మ, బాలామణి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

## దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితం, జంతుశాస్త్రం, ఆర్థికశాస్త్రం అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.రవికుమార్ తెలిపారు. పీజీలో 55 శాతం ఉత్తీర్ణతతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులు 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### పీసా సభ వాయిదా

ఎటపాక: ఎటపాకలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులిచ్చేందుకు తలపెట్టిన పీసా గ్రామసభకు అధికారులు హాజరు కాలేదు. ఇందులో పాల్గొన్న ఎంపీపీ కామేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు సుస్మిత మాట్లాడుతూ.. అధికారుల తీరు సరికాదని పేర్కొన్నారు. సభను వాయిదా వేస్తున్నట్లు గిరిజనులకు తీర్మానపత్రం అందజేశారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: వంజరి పంచాయతీ గొప్పులపాలెంలో సోమవారం రామాలయాన్ని ప్రారంభించారు. రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు నిధులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో ఈ గుడి నిర్మించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన చేశారు. దేవాదాయశాఖ అధికారి సతీష్‌బాబు, విశ్వహిందూ పరిషత్తు సభ్యులు అప్పలరాజు, వెంకటరమణ, సన్యాసినాయుడు, కృష్ణ, భీమన్న, చైతన్య, భక్తులు పాల్గొన్నారు.


గొప్పులపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సువర్ణ కొండపై సాయిబాబా

### ఘనంగా అన్నసమారాధన

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఇందుకూరుపేట-ఇందుకూరు మధ్య సువర్ణ కొండపై సాయి నవరాత్రుల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బాబాను దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

